క్లుప్తంగా

మండల సర్వేయర్‌కు సన్మానం



సర్వేయర్‌ను సన్మానిస్తున్న తహసీల్దార్

గిద్దలూరు రూరల్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు అందుకున్న మండల సర్వేయర్ మండ్ల ఆంజనేయులను మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి సన్మానించారు. సర్వేయర్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ వై.పి.రంగయ్యయాదవ్, కౌన్సిలర్ లొక్కు రమేష్, మాజీ కౌన్సిలర్ మండ్లా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి శివగౌరీ కలశ పూజ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మార్కాపురం టౌన్: శ్రావణ మాసం చివరి మంగళవారం సందర్భంగా మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారికి శివగౌరీ కలశ పూజను అర్చకులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అమూల్య

కొమరోలు: ప్రభుత్వ వైద్యశాలల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య పేర్కొన్నారు. మండలంలోని రాజుపాలెం ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండాలని సూచించారు. రోగులతో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజుపాలెం సర్పంచ్ హటేల్‌పీరా, తాటిచెర్ల ఎంపీటీసీ కామూరి శ్రీనివాసులరెడ్డి, వైద్యాధికారి డాక్టర్ కడప వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బురదలో జారిపడి మహిళా కండక్టర్‌కు గాయాలు



గాయపడిన మహిళా కండక్టర్

గిద్దలూరు రూరల్: స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ మార్గంలో బురద పేరుకుపోయిన రోడ్డుపై నడుస్తూ ఓ మహిళా కండక్టర్ జారి పడి గాయాలపాలయ్యారు. మంగళవారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. వీరమ్మ అనే మహిళా కండక్టర్ విధులు ముగిసిన అనంతరం బస్సును గ్యారేజీలో ఉంచి తిరిగి వస్తున్న సమయంలో బురద రోడ్డులో ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడిపోయారు. దీంతో ఆమె కుడి కాలుకు తీవ్ర గాయమైంది. సహచర సిబ్బంది ఆమెను చికిత్స నిమిత్తం పట్టణంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కాగా, బురద రోడ్డులో రోజూ వెళ్లలేకపోతున్నామని కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్యారేజీ మార్గాన్ని బాగు చేయించాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

యూరియా కొరతతో ఇక్కట్లు పడుతున్న రైతులు

- వర్షాల నేపథ్యంలో పంటలను బతికించుకునేందుకు తంటాలు
- డిమాండ్ మేరకు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంపై ఆగ్రహం
- ఆర్‌ఎస్‌కేలు, ఎరువుల దుకాణాల చుట్టూ చక్కర్లు
- ఆర్‌ఎస్‌కేలో కట్ట రూ.265 కాగా డీలర్ వద్ద రూ.450-రూ.500
- అధిక ధరకు కొనుగోలు చేయలేక అన్నదాతల గగ్గోలు



బలం మందు.. దొరుకుతలేదు!

బేస్తవారిపేట:

యూరియా కొరత అన్నదాతలను వేధిస్తోంది. ప్రస్తుతం సాగు చేసిన పంటలను బతికించుకునేందుకు యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో పుష్కలంగా అందుబాటులో ఉన్న యూరియాకు ప్రస్తుతం ఎందుకు కొరత ఏర్పడిందో అంతుపట్టడం లేదని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

గిద్దలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 22,814 హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సి ఉంది. సకాలంలో వర్షాలు పడకపోవడంతో 7,028 హెక్టార్లలో సాగు చేసినట్లు అధికారుల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాల్లో వరి 203, సజ్జలు 685, మొక్కజొన్న 1172, కొర్రలు 246, కందులు 492, పెసలు 16, మినుములు 247, నువ్వులు 776, ఆముదం 831, సోయాబీన్ 49, పత్తి 1532,పసుపు 128, టమోట 100, కూరగాయలు 411, ఇతర పంటలు 250 హెక్టార్లలో సాగు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో వ్యవసాయ బోర్ల కింద పంటలు సాగు చేశారు. ఎక్కువగా మొక్కజొన్న, మిరప, అరటి, మినుము, కూరగాయల పంటలు సాగులో ఉన్నాయి. ఆయా పంటలకు యూరియా వాడకం తప్పనిసరి.



మొక్కజొన్న పంట

అధికారుల ప్రకటనలపై రైతుల ఆగ్రహం

మొక్కజొన్నకు ఎకరాకు మూడుసార్లు 3 బస్తాల చొప్పున, అరటికి ఎకరాకు 20 బస్తాలు, చెరకు పంటకు 5 బస్తాల చొప్పున యూరియా వేయాలి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో ఈ పంటలకు యూరియా తప్పనిసరి అయింది. దీంతో రైతులు ఆర్ఎస్‌కేలు, ప్రైవేట్ ఎరువుల దుకాణాల చుట్టూ తిరుగుతున్నా యూరియా మాత్రం దొరకడంలేదు. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇలా ఉంటే జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్‌తోపాటు వ్యవసాయ శాఖ అధికారులు ప్రకటనలు చేస్తుండటం రైతులను ఆగ్రహానికి గురిచేస్తోంది. డిమాండ్ మేరకు యూరియా అందుబాటులో ఉంచకపోతే రోడ్డెక్కి నిరసన తెలపడమే శరణ్యమని రైతులు చెబుతున్నారు.



సాగులో ఉన్న నువ్వుల పంట

రైతులపై ధరా భారం

ఆర్‌ఎస్‌కేలకు యూరియా పూర్తి స్థాయిలో సరఫరా కాకపోవడంతో రైతులు తప్పనిసరి స్థితిలో ప్రైవేట్ ఎరువుల దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్‌ఎస్‌కేల్లో రూ.260 లభించే యూరియా బస్తాను రూ.400 నుంచి రూ.450 వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉండగా హోల్‌సేల్ వ్యాపారులు ఫర్టిలైజర్స్ దుకాణాలకు యూరియా విక్రయించే సమయంలో రసాయనిక ఎరువులు కొనాలని షరతు విధిస్తుండటంతో డీలర్లు వెనకడుగు వేస్తున్నారు. ఇప్పటికే తీసుకున్న రసాయన ఎరువులు అమ్ముడుపోకపోవడం లేదని బేస్తవారిపేటలోని కొందరు డీలర్లు యూరియా తెప్పించడమే మానేశారు.

యూరియా అందుబాటులో ఉంచాలి



పత్తి, మిరప, మొక్కజొన్న, అరటి పంటలకు యూరియా చాలా అవసరం. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. ఈ సమయంలో యూరియా వేయకపోతే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది. యూరియా లేక రైతులంతా చాలా ఇబ్బంది పడుతున్నారు. డిమాండ్ ఉన్నంత మేరకు పంటలకు అవసరమైన యూరియాను ప్రభుత్వం సరఫరా చేయాలి.

– రెడ్డి చిన్నమల్లారెడ్డి, ఆర్.కొత్తపల్లె

ఆర్‌ఎస్‌కేల చుట్టూ ప్రదక్షిణ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతులకు స్వగ్రామంలోనే అన్ని రకాల సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలను కూటమి ప్రభుత్వం కేవలం పేరు మార్చి గాలికొదిలేసింది. ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అవసరమైన రైతులు ఆర్‌ఎస్‌కేల్లోని కియోస్క్‌లో నేరుగా బుక్ చేసుకునే సదుపాయం గతంలో ఉండేది. ప్రస్తుతం అలాంటి పరిస్థితి లేకపోగా యూరియా కావాలని కోరుతున్న రైతులను పట్టించుకునేవారే కరువయ్యారు. మండల కేంద్రాల్లోని ఆర్‌ఎస్‌కేలకు అరకొరగా సరఫరా చేస్తున్న యూరియా ఎవరికి పంపిణీ చేయాల్లో తెలియక వీఏఏలు తలపట్టుకుంటున్నారు. యూరియా పంపిణీలోనూ కూటమి నేతలు జోక్యం చేసుకుంటుండటం, ఒక్కొక్కరికి కేవలం 2–3 బస్తాలు మాత్రమే ఇస్తుండటంతో రైతులు అగ్గి మీద గుగ్గిలమవుతున్నారు. యూరియా కోసం రైతులు గత నెల రోజులుగా రైతు సేవా కేంద్రాల చుట్టూ చక్కర్లు కొడుతున్నా ప్రభుత్వం పట్టీపట్టనట్టుగా వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కంభం చెరువుకు వరదనీరు



కంభం చెరువు వైపు ప్రవహిస్తున్న గుండ్లకమ్మ

కంభం/గిద్దలూరు రూరల్: నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కంభం చెరువులో 4 అడుగుల మేర నీరు ఉండగా ప్రస్తుతం గుండ్లకమ్మ, జంపలేరు వాగుల ద్వారా మరో అడుగు మేర నీరు చేరినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నల్లమలలో భారీ వర్షాలు కొనసాగితే చెరువుకు మరింత నీరొచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అలాగే గిద్దలూరు సమీపంలోని సగిలేరులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కె.ఎస్.పల్లె సమీపంలో ప్రతాప్‌రెడ్డికాలనీకి వెళ్లే మార్గంలో సగిలేరు బ్రిడ్జి నీట మునిగింది. సగిలేరు సమీపంలో నివాసం ఉంటున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



సగిలేరులో వరద నీటి ఉధృతి

ఉపాధ్యాయుడిపై తల్లిదండ్రుల ఆగ్రహం

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులోని ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు సరిగా చదువు చెప్పడం లేదంటూ తల్లిదండ్రులు మంగళవారం ఉపాధ్యాయుడు ఎం.షాబుద్దీన్‌ను నిలదీశారు. సమయానికి రాకపోవడంతోపాటు మధ్యాహ్నం తర్వాత కనిపించకుండా పోతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉర్దూలో బోధించాల్సిన పాఠాలు ఇంగ్లిష్‌లో చెబుతుండటం, సిలబస్, వర్క్ బుక్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎంఈఓ సుజాతకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ హుటాహుటిన పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులకు నచ్చజెప్పారు. ఉపాధ్యాయుడిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతానని హామీ ఇవ్వడంతో తల్లిదండ్రులు శాంతించారు.



ఉర్దూ ఉపాధ్యాయుడిని విచారిస్తున్న ఎంఈఓ సుజాత, పక్కన విద్యార్థుల తల్లిదండ్రులు

గుంతలతో వాహనదారులకు చింత



మార్కాపురం గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంత

మార్కాపురం టౌన్: మార్కాపురం–కంభం రహదారిలో గుండ్లకమ్మ బ్రిడ్జి వద్ద స్పీడ్ బ్రేకర్‌ను గత నెల 4వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పర్యటన నేపథ్యంలో తొలగించారు. అలాగే పట్టణంలోని ప్రధాన రహదారిలో పలు చోట్ల ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లను సైతం తీసేశారు. వాటిని తిరిగి నిర్మించకపోవడంతో యువత మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. బ్రిడ్జి వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ తొలగించిన ప్రదేశంలో లోతైన గుంత ఏర్పడింది.

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గణేష్‌నగర్‌లోని పాత నాగేంద్రుడు వైద్యశాల వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓ సెల్‌ఫోన్ టవర్ కంపెనీవారు కేబుల్ ఏర్పాటు కోసం సీసీ రోడ్డుపై గుంత తీసి అలాగే వదిలేశారు. దానిని గమనించని వాహనదారులు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



గిద్దలూరులో రోడ్డు మధ్య ప్రమాదకరంగా గుంత

తర్లుపాడుకు బస్సులు నడుపుతాం

సాక్షి ఎఫెక్ట్..

మార్కాపురం టౌన్: మార్కాపురం నుంచి తర్లుపాడు మీదుగా బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డిపో మేనేజర్ ఏఎస్ నరసింహులు తెలిపారు. బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్న విషయమై 'ఉచితం.. చక్రబంధం', 'అస్తవ్యస్తంగా ఉచిత బస్సు పథకం' శీర్షికలతో ఈనెల 17న 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలపై డీఎం స్పందించారు. బస్టాండులో కొంతమంది ప్రయాణికులు శ్రీశైలం వెళ్లేందుకు వేచి ఉన్నారని, వారి రద్దీని దృష్టిలో ఉంచుకుని 5 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని చెప్పారు.

నేటితో అన్నదాత సుఖీభవ గడువు పూర్తి

అర్ధవీడు: అన్నదాత సుఖీభవ సాయం అందని రైతులు అర్జీలు సమర్పించే గడువు బుధవారంతో ముగుస్తుందని ఏఓ జి.శివగంగ ప్రసాద్ తెలిపారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాపినేనిపల్లి, చీమలేటిపల్లిలో పత్తి పంటను మంగళవారం పరిశీలించి రైతులకు జాగ్రతలు తెలియజేశారు. పత్తి పంటకు ఏ మేరకు నష్టం వాటిల్లిందో తెలుసుకున్నారు. ఆయన వెంట వీఏఏలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆర్‌డీఎస్‌ఎస్ నూతన విద్యుత్ లైన్లు వేస్తున్న కారణంగా మండలంలోని పోసుపల్లె, మొట్టుపల్లె గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పొదిలి రూరల్: మండలంలో ఆర్డీఎస్‌ఎస్ నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు కారణాంగా మల్లవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ మోహన్‌రెడ్డి తెలిపారు. మల్లవరం, కుంచేపల్లి, అన్నవరం, సూదనగుంట ఫీడర్ల పరిధిలోని వినియోగదారులు సహకరించాలని ఏఈ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు.

ఫొటోగ్రాఫర్లు ఐకమత్యంగా ఉండాలి



కేక్ కట్ చేస్తున్న ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న చేస్తున్న సీఐ సుబ్బారావు, పక్కన ఎస్సైలు, ఫొటోగ్రాఫర్లు.

గిద్దలూరు రూరల్: సమస్యల పరిష్కారం కోసం ఫొటోగ్రాఫర్లు ఐకమత్యంగా ఉండాలని ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘ అధ్యక్షుడు బొంత ప్రభాకర్‌యాదవ్ పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ డాగ్ రే జయంతి సందర్భంగా పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల మానసిక దివ్యాంగుల స్కూల్లో మంగళవారం కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. పాఠశాలకు నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు పాల్గొన్నారు.

పేదలకు అన్న సంతర్పణ

మార్కాపురం: ప్రపంచ ఫొటోగ్రఫీ డేను పురస్కరించుకుని మార్కాపురం పట్టణ ఫొటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. స్థానిక పాత బస్టాండ్‌లోని గాంధీ పార్కు వద్ద సీఐ సుబ్బారావు, ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్, అంకమరావు తదితరులు అన్నదానాన్ని ప్రారంభించారు. సీఐ మాట్లాడుతూ.. ఒక్క క్షణం జరిగిన సంఘటన చిరకాలం గుర్తుండాలంటే ఫొటోతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు పల్లా ఓబయ్య, దొంత వెంకటేశ్వర్లు గౌడ్, జి.నాగరాజు, బాబీ, శివమణి, నారాయణరెడ్డి, గోపాలుని హరి, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో జెడ్పీ పాఠశాల విద్యార్థినుల ప్రతిభ



బహుమతులు పొందిన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

మార్కాపురం: ఒంగోలులో ఈ నెల 17న నిర్వహించిన కరాటే పోటీల్లో మార్కాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం శ్రీదేవి, పీడీ జాహ్నవి తెలిపారు. మంగళవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. అండర్–17 కుమితే విభాగంలో తంగిరాల సౌజన్య ప్రథమ స్థానం, అండర్–17 కటా విభాగంలో పిన్నిక వెంకట కౌసల్య, అండర్–14 కటా విభాగంలో వెంకట కల్యాణి ద్వితీయ స్థానంలో నిలిచారని పేర్కొన్నారు. విద్యార్థినులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్‌ను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ రోహిణి తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రాచర్ల: మండలంలోని ఆకవీడు, అచ్చంపేట, చినగానిపల్లె, చోళ్లవీడు గ్రామాల్లోని ఇరిగేషన్ చెరువులను ఆ శాఖ డీఈ సీహెచ్ రామారావు మంగళవారం పరిశీలించారు. నల్లమల అటవీ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గుండ్లకమ్మ వాగు ఉధృతి పెరిగి రామన్నకతువ అలుగు పారుతుండటంతో రంగయ్యనాయుడు చెరువు, దొడ్డేటి చెరువు, ఆకవీడులోని అప్పలేటి చెరువు, అచ్చంపేటంలోని ఎర్ర గుడిదిన్నె చెరువులతోపాటు ఆకవీడు గ్రామంలోని తురకవాని చెరువు పంటకాలువలను పరిశీలించారు. గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువుల సమీపంలో చిన్న పిల్లలను తీసుకెళ్లొద్దని హెచ్చరించారు. ఆయన వెంట వర్క్‌ఇన్‌స్పెక్టర్ శేఖర్, శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



చెరువులను పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈ రామారావు